## సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

**9705347494**

నంబర్‌ను సంప్రదించండి

## క్లుప్తంగా

### కాశీ విశ్వేశ్వరాలయంలో చోరీ

**తగరపువలస:** భీమిలి మండలం టి.నగర పాలెం పంచాయతీ గొల్లలపాలెంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి దొంగలు పడి హుండీలో నగదు, ఆంప్లిఫైర్ చోరీ చేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు భీమిలి క్రైం ఎస్‌ఐ సూర్యప్రకాష్, సిబ్బంది వచ్చి సీసీ కెమెరాలు పరిశీలించారు. చోరీకి పాల్పడిన వ్యక్తి శుక్ర, శని వారాలలో రాత్రివేళ వచ్చి కెమెరాలను ఆకాశం వైపు తిప్పినట్లు గుర్తించారు. 2024 కార్తీకమాసం తరువాత హుండీని తెరవలేదని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. రూ.40 వేల వరకు నగదు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. క్రైం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### పంచాయతీలకు బ్లీచింగ్, సున్నం అందజేత

**తగరపువలస:** భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం భీమిలి, భోగాపురం మండలాలలోని 20 పంచాయితీలకు రూ.4 లక్షల విలువైన బ్లీచింగ్, సున్నం బస్తాలను సోమవారం పంపిణీ చేసింది. ఈ పంపిణీని సంస్థ ప్రధాన ద్వారం వద్ద జనరల్ మేనేజర్ ఎం.ఎస్.ఎన్ రావు ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పంచాయతీలలో పారిశుధ్యం పెంపొందించే కార్యక్రమంలో భాగంగా వీటిని అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో భీమిలి ఎంపీడీవో నరసింహారావు, సంస్థ సీఎస్ఆర్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు, కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### తాకట్టు రుణాలు రూ.10 లక్షల వరకు పెంపు

**తగరపువలస:** ఆనందపురం మండలం వేములవలస శ్రీపాండురంగ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో తాకట్టు రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్టు సంఘం చైర్మన్ రౌతు నాగరాజు తెలిపారు. రైతులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘంలో 1308 మంది సభ్యులు ఉన్నారని, వీరి నుంచి సంఘానికి రూ.2.93 కోట్లు రావలసి ఉందని తెలిపారు. అలాగే కాలం తీరిన రుణాలు రూ.34.78 లక్షలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా బంగారు ఆభరణాలపై రుణాలు ఇవ్వాలని సభ్యులు కోరారు. రైతులు సకాలంలో బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్ దల్లి రాంబాబు, సీఈవో దశావతారం పాల్గొన్నారు.


### దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్న రవితేజ

**పద్మనాభం:** ది ఎబిలిటి పీపుల్ సంస్థ దివ్యాంగులకు సమకూర్చిన కృత్రిమ ఉపకరణాలను సోమవారం పంపిణీ చేశారు. పద్మనాభం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ వీటిని అందజేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కె.రమణ, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కె.లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

### జోన్-2 పీజీఆర్ఎస్‌కు 22 అర్జీలు



జెడ్సీ కనకమహాలక్ష్మికి సమస్యలు వివరిస్తున్న అర్జీదారులు

**మధురవాడ:** జీవీఎంసీ జోన్-2లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 22 అర్జీలు వచ్చాయి. జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 5, ఈఈ వర్క్స్- 7, వాటర్ సప్లై -1, ఎలక్ట్రికల్-3, పబ్లిక్ హెల్త్-5, హార్టికల్చర్ విభాగానికి 1 చొప్పున అర్జీలు అందాయి. అత్యధిక విభాగాల అధికారులు షరా మామూలుగానే గైర్హాజరు కావడంతో, జెడ్సీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**జోన్-1కు 14 వినతులు**

**భీమునిపట్నం:** భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 14 వినతులు వచ్చాయి. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి ఐదు, రెవెన్యూ విభాగానికి ఐదు, పట్టణ ప్రణాళిక విభాగానికి మూడు, యూసీడీ విభాగానికి ఒక వినతి ఉన్నాయి. ఈ వినతులను పరిశీలించి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జెడ్సీ వెల్లడించారు.

# రోడ్డు హీనం.. ఒళ్లు హూనం



బీఆర్ తాళ్లవలస వద్ద గోతులు పడిన రోడ్డు

**పద్మనాభం:** మండలంలోని రేవిడి-ఐనాడ ఎస్‌హెచ్-46 రోడ్డు అటు విస్తరణకు, ఇటు మరమ్మతులకు కూడా నోచుకోక అధ్వానంగా మారింది. గోతులమయమైన రోడ్డులో రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

**ముందుకు కదలని విస్తరణ పనులు**

రేవిడి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ఐనాడ జంక్షన్ వరకు 12 కిలోమీటర్లు నిడివి గల రోడ్డు చాలా ఇరుకుగా ఉంది. 12 అడుగుల వెడల్పు ఉన్న ఈ రోడ్డును 40 అడుగులకు విస్తరించడంతో పాటు రోడ్డు అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీఆర్ఐఎఫ్ నిధులు రూ.16 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో 2022 ఫిబ్రవరిలో రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. లింగన్నపేట, వెంకటాపురం సమీపంలో మూడు పైపు కల్వర్టులు నిర్మించారు. కల్వర్టుల నిర్మాణం వరకే పనులు పరిమితం చేశారు. తరవాత ఇంచి కూడా పనులు ముందుకు వెళ్లలేదు. బీఆర్ తాళ్లవలస వద్ద కల్వర్టు నిర్మాణానికి సిమెంటు పైపులు తీసుకువచ్చి పొలాల్లో గాలికి వదిలేశారు. ఇక్కడ కల్వర్టు లేక ఇది లోతట్టు ప్రాంతం కావడంతో వర్షపు నీరు రోడ్డుపై నుంచి ప్రవహించి, వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పనులు ప్రారంభించి మూడున్నరేళ్లు దాటిపోతున్నా పురోగతి లేదు. ఈ రోడ్డుపై పద్మనాభం మండలం రేవిడి, వెంకటాపురం, కోరాడ, లింగన్నపేట, బొత్సపేట, బి.ఆర్.తాళ్లవలస, ఐనాడ, భీమునిపట్నం మండలం మజ్జిపేట గ్రామానికి చెందిన ప్రయాణికులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలతో పాటు భారీ వాహనాలైన లారీలు తిరుగుతూ ఉంటాయి. రోడ్డు ఇరుకుగా ఉండడంతో లారీల వంటి భారీ వాహనాలు ఎదురుగా వచ్చేటప్పుడు ఆటోలు, ద్విచక్ర వాహనాలు తప్పుకోలేని పరిస్థితి. దీనికితోడు రోడ్డు మొత్తం పెద్ద పెద్ద గోతులు పడడంతో ద్విచక్ర వాహనచోదకులు గోతుల్లో పడి ప్రమాదాల పాలవుతున్నారు. రాళ్లు తేలిపోవడంతో ద్విచక్ర వాహనచోదకులు జారి పడుతున్నారు. అటు రోడ్డు విస్తరణ చేపట్టక, ఇటు మరమ్మతులు చేయకపోవడంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బీఆర్ తాళ్లవలసలో కల్వర్టు లేక రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు



వెంకటాపురం వద్ద గోతులమయమై ఇలా..



విస్తరణకు నోచుకోని ఐనాడ-రేవిడి రోడ్డు

### లారీల వంటి వాహనాలు తప్పించడం ఇబ్బంది



రేవిడి-ఐనాడ రోడ్డు విస్తరణ పనులను తక్షణమే చేపట్టాలి. పనులు ప్రారంభించి మూడున్నరేళ్లయినా పూర్తి కాలేదు. నేను రేవిడి నుంచి విజయనగరం వరకు ఆటో నడుపుతాను. రోడ్డు ఇరుకుగా ఉండడంతో లారీల వంటి భారీ వాహనాలు ఎదురుగా వచ్చేటప్పుడు బళ్లు గానీ, మనుషులు గానీ తప్పించుకోలేని పరిస్థితి.

– ఎన్.అప్పలరాజు, ఆటో డ్రైవర్, రేవిడి

### ప్రయాణం నరకయాతన



నేను ఫెన్సింగ్ పోల్స్ వేయడం, వైరు చుట్టడం వంటి పనులు చేస్తాను. ఈ పనులు చేయడానికి నేను రోజూ విజయగనరం ఆటోలో వెళ్లాల్సి వస్తుంది. రోడ్డు మొత్తం గోతులు పడడంతో ఆటోలో కూర్చున్న వారంతా కుదుపులకు గురవడంతో ఒళ్లు హూనం అవుతోంది. రోడ్డుపై రాళ్లు తేలిపోయాయి. ద్విచక్ర వాహనచోదకులు గోతుల్లో పడి ప్రమాదాల పాలవుతున్నారు. రాళ్లు తేలిపోవడంతో ద్విచక్ర వాహనచోదకులు జారి పడిపోతున్నారు.

– బి.ఈశ్వరరావు, కార్మికుడు, మజ్జిపేట

## కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్నశ్రీను, పరిశీలకుడు తైనాల

**కొమ్మాది:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న వారికి డిజిటల్ బుక్ అండగా నిలుస్తుందని నియోజకవర్గ ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) అన్నారు. ఎండాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, భీమిలి నియోజకవర్గ పరిశీలకుడు తైనాల విజయ్ కుమార్‌తో కలసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. చిన్న శ్రీను మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలకు భరోసానిస్తూ ఈ డిజిటల్ బుక్‌ను ప్రారంభించారన్నారు. ఈ పాలనలో దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు పరాకాష్టకు చేరుకున్నాయని, కార్యకర్తలే కాకుండా మీడియా ప్రతినిధులపై కూడా అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. ఈ దిశగా అందరికీ అండగా ఉండేందుకు ఈ డిజిటల్ బుక్‌ను ప్రవేశపెట్టారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా నిలుస్తూ, వారికి పెద్ద పీట వేస్తుందని తెలిపారు. పార్టీని నమ్ముకున్న ఏ నాయకుడికి, కార్యకర్తకు అన్యాయం జరిగినా ఈ డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తున్నామని, మరలా అధికారంలోకి రాగానే అందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యకర్తల సమస్యలను క్యూఆర్ కోడ్ ద్వారా కానీ, 04049171718 నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కోరాడ వెంకట్రావు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, వార్డుల అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి, పోతిన హనుమంతరావు, పోతిన శ్రీనివాసరావు, పోతిన ప్రసాద్, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు వంకాయల మారుతిప్రసాద్, చెన్నాదాసు, బంక సత్యం, మజ్జి వెంకట్రావు, బింగి హరికిరణ్ రెడ్డి, జగ్గపిల్లి నరేష్, పిల్లా సూరిబాబు, పిల్లా సుజాత, ముదుండి రాజేశ్వరి, పద్మావతి, భాస్కర్ రెడ్డి, వేముల ఈశ్వర్ రెడ్డి, జగ్గపిల్లి ప్రసాద్, రాములప్పడు, డబ్బీరు ప్రశాంతి పట్నాయక్, సిరి సహస్ర, వరలక్ష్మి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### గుండె ఆరోగ్యంపై అవగాహన



వేములవలసలో అవగాహన ర్యాలీ చేస్తున్న గ్రామీణ వైద్యులు

**తగరపువలస:** జీవనశైలిలో మార్పుల కారణంగా ముందస్తు హెచ్చరికలు లేకుండా గుండెపోటు, వయసుతో సంబంధం లేకుండా ఆకస్మిక మరణాలు సంభవిస్తున్నాయని ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి పేర్కొన్నారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఆనందపురం మండలం వేములవలస కూడలిలో గ్రామీణ వైద్యులు సోమవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఆహార అలవాట్లలో మార్పులు, చిన్నపాటి వ్యాయామం, ఒత్తిడి లేని జీవనంతో గుండెను పదిలం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు పోతిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, వినోద్‌కుమార్, మురళి, నీలకంఠం, గౌరి, కె.ఎస్.రావు, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

### రామాలయాల పునర్నిర్మాణానికి మళ్లీ శంకుస్థాపనా?



అదే ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రస్తుత ఎమ్మెల్యే గంటా

**పద్మనాభం:** మండలంలోని రెడ్డిపల్లి, తునివలస గ్రామాల్లో దేవదాయశాఖ సర్వశ్రేయో (సీజీఎఫ్) నిధులు రూ.1.80 కోట్లతో నిర్మించనున్న రెండు రామాలయాలకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఈ నిధులు మంజూరయ్యాయి. రెడ్డిపల్లిలో ప్రజల విరాళం రూ.20 లక్షలు రాగా, దేవదాయశాఖ సర్వశ్రేయో నిధుల నుంచి రూ.1కోటి, తునివలసలో ప్రజలు రూ.10 లక్షలు ఇవ్వగా, సీజీఎఫ్ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో 2024 మార్చిలో అప్పటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ ఆలయాల పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారం అధికారం కోల్పోవడంతో పనులు చేపట్టలేదు. మళ్లీ ఇదే నిధులతో ఇవే ఆలయాల పునర్నిర్మాణానికి కొత్తగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలకు ప్రస్తుత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేసి ఆవిష్కరించారు. తునివలసలో కొత్త శిలఫలకానికి సమీపంలోనే పాత శిలా ఫలకం కూడా ఉంది. పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఆలయాలకే మళ్లీ శంకుస్థాపన చేయడంపై పలువురు గుసగుసలాడుకున్నారు. ఒకే ఆలయాలకు రెండు సార్లు శంకుస్థాపన చేయడంపై విస్మయం వ్యక్తం చేశారు.

### జీఎస్టీ తగ్గింపుపై అవగాహన



జీఎస్టీ తగ్గించిన ధరల జీవోను ఏపీఎం రమణకు అందజేస్తున్న ఏసీటీవో రవి

**తగరపువలస:** జీఎస్టీ తగ్గింపుపై రవాణా, జీఎస్టీ అధికారులు భీమిలి మండలం తాళ్లవలసలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, జీఎస్టీ అధికారులు ఆర్.శ్రీనివాసరావు, యు.విజయకుమర్ వర్మ తదితరులు మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపు కారణంగా ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు తదితర వాహనాలపై రూ.10వేల నుంచి రూ.లక్షన్నర వరకు ధరలు తగ్గాయన్నారు. దేశవ్యాప్తంగా 99 శాతం వస్తు సేవలు పన్నురహిత లేదా 0, 5,18 శాతం జీఎస్టీ పరిధిలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కె.నరసింహారావు, సర్పంచ్ బోని జగ్గమ్మ, అక్కరమాని అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### అలరించిన నృత్య రూపకం

**పీఎం పాలెం:** దసరా ఉత్సవాల్లో భాగంగా శిల్పారామం జాతరలో సోమవారు సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. నగరంలోని శ్రీ సిద్ధేంద్ర యోగి నృత్యాలయంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు తమ నృత్యంతో ఆహూతులను అలరించారు. జగజ్జననికి దండాలు దండాలు అంటూ కీర్తిస్తూ సాగిన గీతానికి చిన్నారులు చేసిన నృత్యం ప్రశంసలను అందుకుంది. మోహన లక్ష్మి నృత్య దర్శకత్వంలో పలువురు చిన్నారులు పాల్గొన్నారు. ఏవో రమేష్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

### గాయత్రీ నగర్‌లో అన్న సమారాధన

**పీఎం పాలెం:** దసరా ఉత్సవాల్లో భాగంగా గాయత్రీనగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పుట్ట బంగారమ్మ, దుర్గామాత ఆలయం వద్ద స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వార్డు సీనియర్ నాయకులు పోతిన ప్రసాద్, అప్పలరాజు, జామి శివ, అప్పారావు పాల్గొన్నారు.

### బిల్లు వసూళ్ల పేరుతో లైన్‌మ్యాన్ చేతివాటం

**తగరపువలస:** ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఒక లైన్‌మ్యాన్ బిల్లుల వసూళ్ల పేరుతో వినియోగదారుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్టు తెలిసింది. యాప్ ద్వారా బిల్లులు చెల్లించలేని వారి కోసం సబ్‌స్టేషన్ నుంచి గతంలో ఒక బిల్లు కలెక్టర్ ఉండేవాడు. ఆయన కూడా వినియోగదారుల నుంచి రెట్టింపు మొత్తంలో వసూలు చేసి ఫ్రాడ్ చేయడంతో ఇటీవల అతనిని తొలగించారు. దీంతో లైన్‌మ్యాన్ దీనిని అవకాశంగా చేసుకుని నిరక్షరాస్యుల నుంచి అధికంగా బిల్లులు వసూలు చేయడంతో మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### సమాజంలో అందరూ సమానమే..

**పద్మనాభం:** 'మాజంలో అన్ని కులాల వారు సమానమేనని తహసీల్దార్ కె.ఆనందరావు అన్నారు. షెడ్యూల్ కులాల వారికి సివిల్ హక్కులు, హక్కుల పరిరక్షణపై తునివలసలో సోమవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కొన్ని హక్కులు కల్పించిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### బాడీ బిల్డింగ్ పోటీల్లో మెరిసిన క్రీడాకారులు

**తగరపువలస:** విజయనగరంలో ఈ నెల 28న జరిగిన 32వ శ్రీఆంధ్ర బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్-2025లో సంగివలస రవి ప్రో ఫిట్‌నెస్ జోన్ క్రీడాకారులు వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. 75-80 కిలోల విభాగంలో విక్రం విన్నర్‌గా నిలిచి టైటిల్ విన్నర్‌గా కూడా నిలిచాడు. 70-75 కిలోల విభాగంలో ఉదయ్, ఖాజీమ్ వరసగా 2,5వ స్థానాలలో నిలిచారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అక్కరమాని మంగరాజు క్రీడాకారులను, కోచ్ నమ్మి రవికుమార్‌ను అభినందించారు.

### ఇనాం రైతులకు సాయం అందించాలని వినతి

**తగరపువలస:** ఆనందపురం మండలం ముచ్చర్ల పంచాయతీలో సుమారు 300 మంది ఇనాం భూముల రైతులకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద సాయం అందించలేదని సర్పంచ్ షిణగం ఎర్రయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించినట్టు ఆయన తెలిపారు.



## వీణాపుస్తక ధారిణి.. విద్యాప్రదాయిని

**చదువుల తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజలు**

**కనులపండువగా దేవీ నవరాత్రి మహోత్సవాలు**





సరస్వతీదేవి అలంకరణలో కారుషెడ్ బబ్బేలమ్మ, ఆలయ మండపంలో నిర్వహించిన అమ్మవారి పూజల్లో పాల్గొన్న మహిళలు, పిల్లలు





సరస్వతీ దేవిగా చంద్రంపాలెం దుర్గాలమ్మ, దుర్గాలమ్మ ఆలయంలో కుంకుమ పూజలకు హాజరైన మహిళలు





గొల్లవీధి కృష్ణుడు బొమ్మ సెంటర్‌లో అమ్మవారి విగ్రహం, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సరస్వతి దేవీ అలంకరణలోని పద్మావతి అమ్మవారి సన్నిధిలో పూజలు



ఎండాడ దుర్గాదేవి ఆలయంలో సరస్వతీ దేవిగా..



విజయదుర్గా ఆలయంలో సరస్వతీదేవి పూజల్లో పాల్గొన్న చిన్నారులు

**పీఎం పాలెం/మధురవాడ/తగరపువలస/కొమ్మాది/భీమునిపట్నం :** దుర్గా దేవి సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సప్తమి, మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని, అమ్మవారిని చదువులతల్లిగా అలంకరించారు. చంద్రంపాలెం జాతరగట్టు దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలకు విశేష సంఖ్యలో మహిళలు హాజరై, పిల్లలతో అక్షరాభ్యాసాలు చేయించారు. సుమారు 5వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

- కారుషెడ్ బబ్బేలమ్మ ఆలయంలో సరస్వతీదేవిగా అలంకరించిన అమ్మవారి చెంత సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.
- భీమిలి కృష్ణాకాలనీ కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పద్మావతీ అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. పిల్లలు, మహిళలు పూజల్లో పాల్గొన్నారు. గొల్లవీధి కృష్ణుడి బొమ్మ సెంటర్ వద్ద యూత్ ఏర్పాటు చేసిన అమ్మవారికి పూజలు చేశారు, చోడేశ్వర ఆలయంలో సరస్వతీదేవిగా అమ్మవారిని అలంకరించి, పూజలు చేశారు. ఎండాడ దుర్గాలమ్మ ఆలయంలో దుర్గాదేవిని సరస్వతీ దేవిగా అలంకరించారు. స్థానిక అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారిని విద్యాలక్ష్మిగా అలంకరించి, చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు.
- చిట్టివలస రైతుబజారు వద్ద అమ్మవారి మండపాన్ని చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర సందర్శించి, అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అన్నదానాన్ని ప్రారంభించారు. గణేష్ యూత్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు అమ్మవారి చిత్రపటం అందించారు.
- శ్రీ విజయదుర్గ ఆలయంలో వందలాది మంది విద్యార్థులు పూజలు చేశారు. పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయంలో దేవాదాయశాఖ దుర్గాహోమం నిర్వహించింది. భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లోని సరస్వతీ విగ్రహం వద్ద విద్యార్థులు పూజలు నిర్వహించారు. తగరపువలస వీధుల్లో భవానీలు కలశాలు, జ్యోతులతో ర్యాలీ నిర్వహించారు.



అష్టలక్ష్మీ ఆలయంలో చిన్నారులతో అక్షరాభ్యాసం



చిట్టివలస రైతుబజారు వద్ద మండపంలో అమ్మవారి సన్నిధిలో సిరి సహస్ర

### అమ్మవారికి మన'సారె



అమ్మవారికి సమర్పించిన సారె

**పద్మనాభం:** అమ్మవారికి గ్రామస్తులు ఘనంగా సారె సమర్పించారు. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా పద్మనాభం గ్రామంలో ఎనిమిదో రోజైన సోమవారం సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన దుర్గాదేవికి గ్రామస్తులు సారె సమర్పించారు. ముందుగా గ్రామంలో ఒక నాటు బండిపై స్వీట్లు, ఇంకొక నాటు బండిపై అరటి పండ్లు గెలలు, కొబ్బరి బొండాలను గ్రామంలో ఊరేగించారు. మహిళలు సారె పట్టుకుని వెంట సాగారు. ఊరేగింపుగా సారె తీసుకు వెళ్లి అమ్మవారికి సమర్పించారు. సర్పంచ్ తాలాడ పాప, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



అమ్మవారికి సమర్పించేందుకు నాటుబండిపై ఊరేగింపుగా తీసుకువస్తున్న సారె